# “నేనును తండ్రియును ఏకమైయున్నాము” (10:22-42)

స్వల్పమే అయినా అద్భుతమైన తన జీవిత కాలంలో మహా అలెగ్జాండరు ప్రపంచంలోని ఎక్కువ భాగాన్ని జయించాడు. క్రీ.పూ. 323లో 33 సంవత్సరాల ప్రాయంలో అతడు మరణించినప్పుడు, తన సామ్రాజ్యాన్ని నమ్మకమైయున్న తన సైన్యాధిపతులకు అతడు విడిచి వెళ్లాడు. వారిలో ఒకడు సెల్యూకస్ I. అతడు సిరియాకు ఏలికయై సెలూసిడ్ రాజ వంశానికి స్థాపకుడయ్యాడు. అనేక సంవత్సరాల తరువాత, అతని సంతతివాడైన యాంటియోకస్ ఎపిఫేనేస్ అధికారానికి వచ్చి, ఐగుప్తుకు దండెత్తుట ద్వారా తన సామ్రాజ్యాన్ని విశాలపరచుకొన నారంభించాడు. ఐగుప్తుపై తన విజయ యాత్ర ముగించిన తోడనే, క్రీ. పూ. 169లో అతడు యెరూషలేము మీదికి దాడిచేశాడు. అతడు అక్కడికి రాగా, అతడు పరిశుద్ధ స్థలంలో ప్రవేశించి విలువైన ప్రతి దానిని తీసికొన్నాడు.[1]

యూదుల దేవాలయాన్ని కొల్లగొట్టడంతో యాంటియోకస్ ఎపిఫేనేస్ సంతుష్టి చెందినట్టున్నాడు. తన సామ్రాజ్యంలోని ప్రజలందరు వేరైనా ఆచారాలను మతాలను వదలి, గ్రీకు భాష మాట్లాడుతూ, గ్రీకు ఆచారాలను అభ్యసించుతూ, గ్రీకు మతాన్ని అవలంభింపవలసిందిగా అతడు జనులను నిర్భంధించాడు.[2] దీన్ని సాధించడానికి గాను, యూదులు తమ దేవునికి బలుల నర్పించకుండను, వారి కుమారులకు సున్నతి చేయకుండగను, విశ్రాంతి దినాలు ఆచరింపకుండను అతడు ఆజ్ఞలు జారీ చేశాడు. దేవాలయమునందలి బలిపీఠము అపవిత్రపరచబడునట్లు అతడు దానిపై పందిని బలిగా అర్పించాడు (దేవునికి యూదులు ఎన్నడూ అర్పించని అపవిత్రమైన జంతువు పంది) మరియు కనబడిన ధర్మశాస్త్ర గ్రంథ ప్రతులను అతడు కాల్చివేశాడు.[3] ఇశ్రాయేలు చరిత్రలో అది తప్పక అజ్ఞానయుతమై ఉంటుంది.

> శాసనం ప్రకారం, తమ శిశువులకు సున్నతి చేయించిన స్త్రీలను, వారి కుటుంబాలను సున్నతి చేసినవారిని వారు సంహరించారు; మరియు శిశువులను తమ తల్లుల మెడలకు వ్రేలాడదీశారు. అయితే ఇశ్రాయేలులో అనేకులు స్థిరంగా నిలిచారు మరియు అపవిత్రమైన భోజనము తినకూడదని తమ హృదయాలలో దృఢ నిశ్చయత చేసికొన్నారు. తమ భోజనమువలన అపవిత్రపరచబడడం కంటెను లేక పరిశుద్ధమైన నిబంధనను అపవిత్రపరచడం కంటెను చనిపోడానికైనా వారు తెగించారు; మరియు వారు చనిపోయారు. మరియు గొప్ప ఉగ్రత ఇశ్రాయేలు మీదికి వచ్చింది.[4]

స్థిరముగా నిలిచిన యూదులలో మత్తయాస్ అని పిలువబడే యాజకుడు ఉన్నాడు. అతడును అతని అయిదుగురు కుమారులును యాంటియోకస్ ఎపిఫేనేస్ యొక్క

శాసనాలను దిక్కరించినందున కొండలకు పారిపోయేలా బలవంత పెట్టబడ్డారు. త్వరలో, దేశంలోని నలు మూలలలోనుండి జనులు వచ్చి వారితో జతకూడి సిరియనులతో యుద్ధం చేయబూనారు. క్రీ.పూ. 167లో మత్తయాస్ మృతినొందగా, అతని కుమారుడైన యూదా మెక్కబీయస్ ఆ తిరుగుబాటుకు నాయకుడయ్యాడు. యూదులు, అతని నాయకత్వం క్రింద, ఆరంభంలో కొన్ని అవాంతరాలను ఎదుర్కొన్నా, వాటిని జయించి సిరియనులను పారద్రోలారు. తమ దేవాలయాన్ని తమ భూములను తిరిగి తీసికొన్నారు. సిరియనులను యెరూషలేమునుండి విజయవంతంగా పారద్రోలిన తరువాత, మొదటిగా వారు తమ దేవాలయాన్ని శుద్ధీకరించుకునే పనిలో ఉన్నారు. "అప్పుడు యూదాయు అతని సహోదరులును, 'ఇదిగో మన శత్రువులు అణచబడ్డారు, మనము పరిశుద్ధ స్థలమును శుద్ధీకరించుకొని దానిని ప్రతిష్ఠించు కొందము రండి'" అని పిలుపునిచ్చారు.[5] దేవాలయము శుద్ధీకరించబడి అది ప్రతిష్ఠింపబడడం సంపూర్తియైనప్పుడు, ప్రతి సంవత్సరం ఎనిమిది దినములపాటు ఆలయపు ప్రతిష్ఠ పండుగ జరగాలని యూదాయు అతని సహోదరులును తీర్మానించారు. ఇశ్రాయేలుకు కలిగిన విడుదలకును, దేవాలయ ప్రతిష్ఠకు జ్ఞాపకార్థంగా వారు ఆలయ ప్రతిష్ఠ పండుగ జరుపుకునేవారు. నేడు అది యూదులకు హనుక్క పండుగగా మారిపోయింది.

తొలి ఆలయ ప్రతిష్ఠ పండుగ జరిగిన రమారమి 200 సంవత్సరాలకు, ఈ పండుగలో పాల్గొనడానికి యేసు యెరూషలేమునకు వచ్చినట్టున్నాడు. ఆ సందర్భములో, తానెవరో ఎందుకు వచ్చాడో ధైర్యంగా ఆయన మాట్లాడాడు. యోహాను 10 మొదటి భాగంలో ఉన్నట్టే, ఎక్కువగా యేసు మాట్లాడేకొలది పరిస్థితి యింకా ఉద్రిక్తంగా మారిపోతుంది. తనను గూర్చి తన శ్రోతలు నిర్ణయించుకునేలా ఆయన వారిని బలవంతం చేస్తున్నాడు. కొందరు ఆయనయందు విశ్వాసముంచారు – మరి కొందరైతే – ప్రాథమికంగా యూదా మత నాయకులు – నమ్మలేదు – సరిగదా. ఆయన పలికిన ప్రతి మాటకు వారు యింకా ఎక్కువ కోపోద్రేకులౌతున్నారు. 10:22–42లో దాఖలు చేయబడిన ప్రతిఘటనల్లో ఆయన విరోధులు తీసికొన్న మూడు చర్యలు, దానికి ఆయన ప్రత్యుత్తరాలు ఉన్నాయి.

## వారు ఆయన చుట్టు గుమికూడారు (10:22-30)

యేసు సొలొమోను మంటపము అనే దేవాలయపు ప్రాంతములో తిరుగుచుండగా, "యూదులు ఆయనచుట్టు పోగైరి" (10:24). ఈ సందర్భములో శ్రేష్ఠమైన తర్జుమా "యూదులు ఆయనచుట్టు గుమికూడిరి" అయ్యుండవచ్చు. "చుట్టు పోగైరి" అనడానికి యిక్కడ ఉపయోగింపబడిన గ్రీకు పదం క్రొత్త నిబంధనలో నాల్గు సార్లు మాత్రమే కన్పిస్తుంది.[6] వీటిలో రెండు సార్లు ప్రాకారములుగల పట్టణాన్ని పట్టుకొనడానికి సైన్యం ముట్టడి వేయడాన్ని సూచిస్తున్నాయి. ఆయన ఎముకల మీదనుండి మాంసాన్ని లాగుకొన పన్నాగంలో ఉన్న గ్రద్దలవలె ప్రభువుకు వ్యతిరేకులైన యూదులు ఆయన చుట్టు మూగారు. ఇది స్నేహితుల సంతోషపు కూడిక కాదు; ఆయనకు భయంకరమైన శత్రువుల యొక్క

భయము పుట్టించే కూడికయై ఉంది!

ఆయన క్రీస్తు అయ్యున్నాడో లేదో తెలుపమని తనను నమ్మని యూదా మత నాయకులు పట్టుపట్టారు. వారు ఆయన చుట్టు మూగి, "ఎంతకాలము మమ్మును సందేహపెట్టుదువు? నీవు క్రీస్తువైతే మాతో స్పష్టముగా చెప్పుమనిరి" (10:24).[7] ప్రభువైన యేసుకును తన్ను నశింపజేయ చూచినవారికిని మధ్య ఉద్రిక్తత పెరుగుతోంది.

తొలి చూపులో, వారి ప్రశ్నకు ఆయన నేరుగా జవాబు చెప్పితే బాగుండి ఉంటుందన్నట్టు కన్పిస్తుంది. అయినా, కొన్ని ప్రశ్నలు కేవలం "అవును" లేక "కాదు" అని చిన్నగా జవాబు చెప్ప వీలుపడదు. "నీవు అబద్ధమాడడం మానావా?" అని ఒకని అడిగినట్టు వారి ప్రశ్న ఉంది. "అవును" అంటే అంతకు ముందు నీవు అబద్ధమాడు తున్నావని నీవు అంగీకరించినట్టవుతుంది! "లేదు" అని అంటే నీవు యింకా అబద్ధాలు ఆడడంలోనే కొనసాగుతున్నావని ఒప్పుకున్నట్లౌతుంది! అందువలన అలాటి ప్రశ్నను నిండైన వివరణతోనేగాని "అవును" లేక "కాదు" అనడంతో చెప్ప వీలుపడదు. ప్రభువైన యేసు దినాల్లో "క్రీస్తు" అనేదానికి ప్రజల మధ్య వేరైన గ్రహింపు ఉండేది. "అవును, నేను క్రీస్తునే" అని చెప్పియున్నట్టయితే, జనులు భయంకరంగా అపార్థం చేసికొనేవారే. ఎందుకంటే "క్రీస్తు" దావీదు, సొలొమోనులవలె శక్తివంతుడైయున్న భూ రాజై ఉంటాడని వారు ఎదురు చూస్తున్నారు. "లేదు" అని ఆయన చెప్పియున్నట్టయితే, ఆయన తన విషయమైన సత్యాన్ని కాదన్నవాడై ఉంటాడు. ఆలాటి సందిగ్ధంలో యిరికింపబడినవాడైన యేసు, యథార్థ హృదయులై దేవుని వెదికేవారికి అర్థమయ్యే రీతిగాను, తన వ్యతిరేకులు తనకు విరోధంగా ఏదీ ఉపయోగించలేనట్టును ఉండే ప్రతిపాదనతో బదులిచ్చాడు. యోహాను 10లో, ముందుగా ఆయన ఉపయోగించిన కాపరి, గొర్రెలు అనే సాదృశ్యాన్నే తిరిగి వినియోగించి, "నా గొఱ్ఱెలు నా స్వరము వినును, నేను వాటి నెరుగుదును, అవి నన్ను వెంబడించును" అని చెప్పాడు (10:27).

ప్రజలు నిజంగా "అడిగి, వెదకి, తట్టినట్టయితే" వారు "పొందుదురు, కనుగొందురు, వారికి తెరువబడునని" యేసు మరొక చోట అన్నారు (మత్తయి 7:7, 8). విశ్వాసంలో గ్రహింపు యిమిడి ఉంటుంది, అయితే దానికంటె యింకా ఎక్కువే విశ్వాసంలో యిమిడి ఉంటుంది. తెరువబడిన హృదయం, యిష్టపూర్వకమైన విధేయత అనేవి విశ్వాసాభివృద్ధికి అత్యవసరమై ఉంటాయి.

తదుపరి, విమర్శనాత్మకమైన, కోపోద్రేకులగు యూదా మత నాయకులచే చుట్టబడియుండగా, ఆయన చెప్పింది వారిని యింకా ఎక్కువగా రేకెత్తించింది. "నేనును తండ్రియును ఏకమైయున్నాము" అని ఆయన ప్రకటించాడు (10:30). ఈ వచనంలోని "ఏకమైయున్నాము" అనేది, "ఒక్కటే"[8] అయ్యున్నాము అనేది యేసును తండ్రియును ఏకమైయున్నట్టు సూచిస్తుంది. మరోసారి యేసు తన దేవత్వాన్ని గూర్చి ధైర్యంగా చెప్పుకున్నాడు, ఆయన నిజంగానే దేవుని కుమారుడై ఉన్నట్టు చెప్పుకున్నాడు. ఆయన వ్యతిరేకులచే చుట్టబడియున్నా, తన గుర్తింపును గూర్చి ఈ ప్రాముఖ్యమైన సత్యాన్ని ప్రకటించడంలో వెనుకాడలేదు.

## వారు రాళ్లు చేతపట్టుకున్నారు (10:31-38)

తానును తండ్రియు ఏకమైయున్నట్టు ప్రభువైన యేసు చెప్పుకున్నదానికి యూదా మత నాయకులు సహించలేకపోయారు. ఆయనను కొట్టాలని మరల వారు రాళ్లు చేత పట్టుకొన్నారు (10:31). అక్కడే దేవాలయంలో ఆయనను చంపాలన్నంతగా కోపోద్రేకులై ఉన్నారు! యేసు మాటలు దేవ దూషణతో కూడినవని వారు ఒప్పింపబడినవారై, వారు చేసేది న్యాయమే అన్నట్టు వారు నమ్మారా. తనపై నేరం మోపేవారి చేతుల్లో రాళ్లు ఉన్నప్పటికిని, తాను దేవుని కుమారుడు అన్న తన గుర్తింపును యేసు స్థాపించ కొనసాగాడు.

సంఘర్షణ పెరుగుతూ ఉండగా, “యేసు – తండ్రి యొద్దనుండి అనేకమైన మంచి క్రియలను మీకు చూపితిని; వాటిలో ఏ క్రియ నిమిత్తము నన్ను రాళ్లతో కొట్టుదురని వారినడిగెను” (10:32). తన క్రియలను బట్టికాదు తానే దేవ దూషణ చేసినందుకే వారు రాళ్లతో కొట్టబోతున్నటు తెలిపారు. ప్రభువైన యేసు తెలిపేదాని యొక్క భావమేమై యుంటుందో కనీసం యూదా మత నాయకులైనా గ్రహించియుండవచ్చు. “–నీవు మనుష్యుడవై యుండి దేవుడనని చెప్పుకొనుచున్నావు” అని వారన్నారు (10:33). యేసు కేవలం నరుడు మాత్రమే అయ్యుంటే, వారు చెప్పేది సత్యమైయుండవచ్చు. ఏది యెలాగున్నా, దేవుని కుమారుడుగా అలా చెప్పుకొనడానికి ఆయనకు ప్రతి హక్కు, ప్రతి హేతువు ఉంది.

కీర్తన. 82:6లోను మాటలతో యేసు తన వ్యతిరేకులను ఎదుర్కొన్నాడు. అక్కడ కీర్తన రచయిత యిలా వ్రాశాడు: “–మీరు దైవములనియు మీరందరు సర్వోన్నతుని కుమారులనియు నేనే సెలవిచ్చియున్నాను.” గతంలో ఉన్నవారిని గూర్చి లేఖనాలు యిలా చెప్పియున్నట్టయితే, అదే భాషను తాను ఉపయోగించినందున తప్పుపట్టనవసరం లేదని ఆయన వారితో వాదించాడు. “తండ్రి ప్రతిష్ఠచేసి యీ లోకములోనికి పంపిన”వాడై ఉన్నట్టు యేసు తన్ను గూర్చి ప్రకటించుకున్నాడు (10:36).

తన్ను గూర్చిన సత్యాన్ని ప్రకటించడంలో యేసు వెనుకంజ వేయనట్టు యోహాను ఆయనను వర్ణించాడు. ప్రజలు ఉగ్రులైయున్నా, రాళ్లు వారి చేతుల్లో యింకా ఉన్నా, యేసు తన పాయింటును నొక్కి చెప్పుతునే ఉన్నాడు. తన కార్యాలను చూచి అవి తండ్రి చేసే క్రియలవంటివో కాదో పరికించుడని ఆయన వారికి పిలుపునిచ్చాడు. తన తండ్రి యొక్క క్రియలే ఆయన చేస్తున్నందున, “తండ్రి నాయందును నేను తండ్రియందును ఉన్నామని” ఆయన వారిని నమ్మమంటాడు (10:38). ఆ దినాన దేవాలయం వద్ద నిలిచియున్న ప్రతివానికి ఆయన భావము విదితమై ఉంది. యేసు మరల దేవుని కుమారుడనని చెప్పుకున్నాడు. రాళ్లతో కొట్టబడతానన్న భీతిని సహా విడిచి ఆయన తనను గూర్చిన సత్యాన్ని ప్రకటించుకున్నాడు.

## వారు మరలా ఆయనను పట్టుకొన వెదకారు (10:39-42)

ప్రభువైన యేసుకు వ్యతిరేకులైనవారు ఆయనను మరల పట్టుకొన జూచారు. అయితే

యూదా మత నాయకులతో పడిన మరియొక పోటీలో ఆయన "విజేత"యైనట్టు తప్పించుకొనిపోయాడు. తన సొంత కాలంలో ఆయన తన ప్రాణాన్ని పెడతానని, తన వద్దనుండి వ్యతిరేకులు దానిని లాగివేయ ప్రయత్నించినప్పుడు కాదని యేసు చెప్తూ వచ్చాడు (10:17, 18). అది ఎలా జరిగిందో మనకు చెప్పబడలేదు గాని ఆయన మాత్రం "వారి చేతినుండి తప్పించుకొని పోయెను" అని చెప్పబడ్డాం (10:39).

దేవాలయంలోని ఎదుర్కోలు తరువాత, బాప్తిస్మమిచ్చు యోహాను గతంలో శక్తివంతమైన తన ఉపన్యాసపు పరిచర్య జరిగించిన యొర్దాను ప్రాంతానికి నది దాటివెళ్లాడు. ఈ సమయానికి, యెరూషలేములో ప్రభువైన యేసు యొక్క బహిరంగ పరిచర్యలో ఎక్కువ భాగం ముగించినట్టే అయ్యింది. ఆయన తనను గూర్చి ధైర్యంగా చెప్పుకున్నది చెప్పబడింది, రణరంగపు గీతలు గీయబడ్డాయి. యేసును గూర్చి జనులలో భేదం పుట్టింది. వారిలో కొందరికి యేసు దేవుని కుమారుడనియు, మరి కొందరికి నరకంనుండి వచ్చిన దయ్యమనే భావాలు ఉన్నాయి.

యొర్దాను వద్ద అనేకులు ఆయన వద్దకు కూడి వచ్చారు. ఇది వారి విషయములో విశ్వాసపు కార్యమై ఉంది. "యోహాను ఏ సూచక క్రియను చేయలేదు గాని యీయనను గూర్చి యోహాను చెప్పిన సంగతులన్నియు సత్యమైనవని" ఆయన వద్దకు వచ్చిన అనేకులు అన్నారు (10:41). యోహాను ఏ సూచక క్రియ చేయకున్నను, దానికి భిన్నంగా యేసు, అనేక సూచక క్రియలు చేసినట్టు వారి మాటలలో గుప్తమైయుంది. విశేషంగా, "సూచక క్రియ"యని యోహాను ఉపయోగించిన ప్రత్యేకమైన పదం 10వ అధ్యాయంలో 41వ వచనమునందు తొలిసారిగా ప్రత్యక్షమయింది. ఈ అధ్యాయములో ముందుగా యేసు చేసిన అద్భుతాలను "క్రియలు"[9] అని మాత్రమే వచింపబడ్డాయి. ఎందుకంటే, వాటిని వీక్షించినవారి హృదయాల్లో విశ్వాసం పుట్టింపబడలేదు. ఏదియెలాగున్నా, యేసునందలి విశ్వాసమనేది ఎక్కడ వర్ణించబడిందో అక్కడ "సూచక క్రియ" అనే పదం కన్పిస్తుంది.

10వ అధ్యాయంలోని సంఘటనలన్నిటికి ముగింపుగా, "అక్కడ అనేకులు ఆయన యందు విశ్వాసముంచిరి" (10:42). వివాహమై ఏభై సంవత్సరాలు గడచిన తరువాత ఆ జంట వెనుకకు తిరిగి ఆలోచించినప్పుడు, "నేను నిన్ను ప్రేమిస్తున్నాను" అనే మాటలు వారి జీవితాల్లో అనేక అర్థాలను స్ఫురింపజేసినట్టే, యోహాను సువార్తలో "అనేకులు విశ్వసించిరి" అనే మాటలు ఆయన చరిత్ర విప్పారుచుండగా వివిధములైన భావాలను యిస్తున్నట్టు కన్పిస్తాయి.

ఈ సమయానికి యోహాను సువార్తలో యేసునందు విశ్వాసముంచడం అనేదానిలోని "విషయం" యేసు దేవుని కుమారుడైన క్రీస్తు అని విశ్వసించడమనే గ్రహింపుకు వచ్చి చేరుకున్నారు. ఇట్టి విశ్వాసం యొక్క "వెల" సంఘర్షణ, భేదములు పుట్టడం, మరణ భయాన్ని ఎదుర్కోవలసి వస్తుందని కూడా వారు గ్రహించారు. ఎవనియందు వారు విశ్వాసముంచారో ఆయనను వెంబడించినందున అరణ్యంలో వెలివేయబడియున్న ఒక గుంపు అన్నట్టు వారిని మనం చూస్తాం.

విశ్వాసం ఎంత వెలగలదైయుందో సూచించుతూ యేసు కఠినమైన సందేశాన్ని యిచ్చినా, ఆయన సందేశం అదే సమయంలో విశ్వాసులను బలపరచునదై లేక ప్రోత్సహించునదై

కూడా ఉంది. క్రీస్తునందు విశ్వాసులుగా మనం వ్యతిరేకతను ఎదుర్కొంటామని మనం గ్రహించాలని ఆయన మనలను కోరాడు. ఏదియెలాగున్నా, వ్యతిరేకత మనకు ఆశ్చర్యం కలిగించడంగాని, లేక మన ఉత్సాహాన్ని ఆర్పడంగాని చేయదు. పైగా, మనం నమ్మిన విశ్వాసంపై స్థిరంగా నిలిచియుండడానికిని – మనం హింసింపబడినప్పుడు సహితం – యేసే మనకు ఉదాహరణగా నిలిచియున్నాడు. హింసాత్మకమైన వ్యతిరేకతకు స్థిరంగా సత్య మార్గాన బదులిచ్చాడు, మనం కూడా అదే జరిగించాలి.

## ముగింపు

ఈ కథనమంతా ఆలయ ప్రతిష్ఠ పండుగ కాలంలో జరిగింది. దేవుని ప్రజలు విడిపింపబడిన దానికి జ్ఞాపకార్థంగా చేసే పండుగలో యేసు కన్పించినప్పుడే, ఆ ప్రజలు ఆయనను దుర్మార్గుడైన దేవ దూషకుడుగా భావించడం వ్యతిరేకార్థాన్ని యిస్తుంది. యూదా మత నాయకులు ఆయనను అపాయకరమైన మనిషిగాను, అబద్ధ బోధకుడుగాను చూచారు. ఆయన సిలువ మరణం పొంది, నిజమైన విడుదలను ప్రసాదించువాడుగా వారు గ్రహింపరైరి. జంతువుల రక్తము కాదు సుమీ – ఆయన తన సొంత రక్తాన్నే ప్రజలను పరిశుద్ధపరచడానికై చిందింపనైయున్న సంగతి వారెరుగరైరి. ఆ దినాన వారు చంప బూనింది. నిర్దోషి, నిష్కళంకుడైయున్న దేవుని గొర్రెపిల్లనే అన్న సత్యాన్ని వారు అభినందించరైరి. అయితే నేడు మనం ఎక్కడ నిలిచామో అక్కడనుండి వాస్తవాలను స్పష్టంగా చూడగలం, మరియు అవి సువార్త యొక్క శిఖరాగ్రమైయున్నట్టు మనం ఎరుగ గలం!

---

సూచనలు

[1]1 మెక్కబీ 1:21. రెండు అపొక్రఫా పుస్తకాలైన మెక్కబీలు క్రీ.పూ. 100 ప్రాంతంలో వ్రాయబడ్డాయి. క్రొత్త, పాత నిబంధనల మధ్య జరిగిన చారిత్రక సంఘటనలు అందు దాఖలు చేయబడ్డాయి. పాలస్తీనాలోని యూదా మతాన్ని అణచడానికి జరిగిన ప్రయత్నాలు, స్వాతంత్ర్యం కొరకైన యూదుల పోరాటం (166–40 B.C.) కొంతవరకు వాటిలో దాఖలు చేయబడింది. [2]1 మెక్కబీ 1:41. [3]1 మెక్కబీ 1:56. [4]1 మెక్కబీ 1:60–64. [5]1 మెక్కబీ 4:36. [6]లూకా 21:20; యోహాను 10:24; అపొ. 14:20; హెబ్రీ. 11:30. [7]"అడుగుతునే ఉన్నారు" అనేది అసంపూర్ణమైన క్రియా వాచకమనే భావాన్ని యిక్కడ సూచిస్తుంది. [8]గ్రీకు మూలంలో నపుంసక లింగంలో యిది ఉంది. [9]గ్రీకులో *ergon* 10:25, 32, 38లో ఉపయోగింపబడింది. "సూచక క్రియ" అనే చర్చను చూడు.